దుకు ఎంతగా నేను గర్విస్తున్నానో మీకు తెలుసా? ధనం, విద్య, గొప్ప వంశం, పొగడ్తలు అనేవి ఎవరికైనా అధికమైన గర్వాన్ని తెచ్చిపెడతాయి. వీటి మైకంలో పడి మనవాడు ఎక్కడ గర్వాంధుడవుతాడో, తప్పుదోవ పడతాడేమోనన్న భయంతోనే నేనిలా ప్రవర్తించాను. అబ్బాయి మనసు నొప్పించానన్న మాట. ఉదయమే విషయం చెప్పి భార్గవకు ఆనందాన్ని కలిగిస్తాను. నీవు పడుకో'' అంటూ ఆలోచనలో పడ్డాడు చంద్రశేఖర శాస్త్రి.

'నిజంగా నా భర్త ఎన్నటికీ నాకర్థం కాడేమో. ఆయనది లోతు గుండె' అనుకుంది గిరిజమ్మ.

భార్గవశాస్త్రి కళ్లకు కప్పిన పొర ఒక్కసారిగా కరిగిపోయింది. 'నా తండ్రి ఎంతటి గొప్పవాడు. ఇలాంటి ఉత్తముని చంపాలనా నేనాలోచించింది. పున్నామ నరకం నుండి రక్షిస్తానో లేదో కాని భరింపలేని పాపాన్ని మాత్రం మూటకట్టుకునే వాడినే. త్రుటిలో ఎంత ప్రమాదం తప్పింది. ఆయన పాదాలపై పడి క్షమాపణ వేడితేనేగాని నా మనసులోని ఆవేదన చల్లారదు' మెల్లగా తండ్రి దగ్గరకు చేరాడు భార్గవ శాస్త్రి.

తండ్రి పాదాలను వాటేసుకుని భోరున ఏడ్చాడు. ఏం జరిగిందో అర్థం కాక అయోమయంగా చూడసాగారు తల్లిదండ్రులు.

''మిమ్మల్ని అర్థం చేసుకోలేక చంపాలనే నిర్ణయానికొచ్చిన పాపాత్ముడ్ని నాన్నా. నా పాపానికి పరిహారం లేదు. నన్ను ఏడ్వనివ్వండి. నా కన్నీటితో మీ పాదాలను కడిగి నా మనోభారాన్ని తగ్గించుకుంటా'' పాదాలను వదలకుండా ఏడ్వసాగేడు భార్గవశాస్త్రి.

''నాయనా భార్గవా! ప్రాయశ్చిత్తాన్ని మించిన పాపపరిహారం లేదు బాబూ. నీ తప్పు తెలుసుకున్నావు. నీలో ఏ తప్పూ లేదు. వూరుకో'' అంటూ కొడుకును అనునయించాడు చంద్రశేఖర శాస్త్రి.

''బిడ్డల మనసు తల్లికి తెలిసినంతగా తండ్రి గ్రహించలేడంటారు. ఇది అక్షరాలా నిజం. భార్గవ మనస్తత్వాన్ని గిరిజ ఎంత బాగా అవగాహన చేసుకుంది. కాలం అనుకూలించింది కాబట్టి సరిపోయింది. లేకపోతే ఎంత అనర్థం జరిగి వుండేది. తల్లిదండ్రులు తమ బిడ్డలు గొప్పవారు కావాలని కోరుకుంటారేగాని, వాని మనోభావాలను కూడా అర్థం చేసుకుని ప్రవర్తిస్తే పిల్లల భవిష్యత్తు మహోన్నతంగా వుంటుంది. అలా కానినాడు ఎవరికైనా విపత్తు తప్పదు'' అనకుంటూ ఆప్యాయంగా కొడుకును అక్కున చేర్చుకున్నాడు భార్గవశాస్త్రి.

**-టి.రామాంజనేయులు** (హాలహర్వి)

☆

# ప్రిస్క్రిప్షన్



''ఈ మందులు అర్జెంట్‌గా తీసుకుని వేయండి. నేను మరోచోట ఆపరేషన్‌కు వెళుతున్నాను'' అంటూ డాక్టర్ రవిచంద్ర ప్రిస్క్రిప్షన్‌ను గోవిందం చేతికి ఇచ్చి బయటకు వెళ్లిపోయాడు.

ప్రిస్క్రిప్షన్ చేత్తో పట్టుకుని బయటకు వచ్చి ఎదురుగా ఉన్న మెడికల్ షాపు వైపు అడుగులు వేయబోయి ఆగిపోయాడు. ఎదురుగా ఉన్న డాక్టర్‌గారి బావమరిది షాపు మూసేసి ఉంది. గోవిందం ఆలోచనలో పడ్డాడు.

'డాక్టర్ గారు అర్జెంట్‌గా మందులు తీసుకుని పాపకు వేయమన్నారు. తీరా చూస్తే షాపులేదు. వీటిని బయట కొనుక్కుని వద్దామంటే డాక్టర్‌గారు ఏమంటారో?'

ఏదైతే అయిందని పక్కవీధిలో ఉన్న మరో మెడికల్‌షాపునకు వెళ్లాడు. అక్కడ కౌంటర్‌లోని వ్యక్తికి ప్రిస్క్రిప్షన్ ఇచ్చాడు.

దాన్నతను పరీక్షగా చూసి ''పై మందులు లేవు మిగిలినవి ఇవ్వమంటారా?'' అడిగాడు.

మళ్లీ ఆలోచనల్లో పడ్డాడు. 'ఒకవేళ పై మందు దొరకని ఐటమ్ అయితే మిగిలిన షాప్ వాళ్ళు ఆ ఒక్క మెడిసిన్ ఇవ్వమంటే ఇవ్వకపోవచ్చు. మొత్తం మెడిసిన్స్ అన్నీ కొంటేనే ఆ మందు ఇస్తామనొచ్చు. అప్పుడేం చేయాలి?' అని మనసులో అనుకుని ''వద్దులెండి'' అంటూ ప్రిస్క్రిప్షన్ తిరిగి తీసుకుని మరో షాపువైపు వెళ్లాడు.

ప్రిస్క్రిప్షన్ అందుకున్న మరో షాపతను దీన్ని చదివి ''పైది అర్థం కావడం లేదండీ. పోనీ మిగిలినవి ఇచ్చెయ్యాలా?'' అడిగాడు. గోవిందం తల అడ్డంగా ఊపి మరో షాపు వైపు నడిచాడు.

ఇంకో షాపతను దాన్ని చూసి పై మందేమిటో అర్థంకాక జుట్టు పీక్కొని అక్కడున్న సీనియర్‌కి చూపించాడు. అతను దాన్ని చూసి జుట్టు పీక్కొని చొక్కా చింపేసుకున్నాడు. అతనికీ ఏం అర్థంకాక ''ప్చ్..పై మెడిసిన్ ఏంటో అర్థంకావడం లేదండీ. డాక్టర్లు అటాచ్డ్ షాపువాళ్లకే అర్థమయ్యేలా కోడ్‌లో రాస్తారు. అక్కడే అడగండి'' అన్నాడు.

మెడిసిన్ అర్జెంట్ అనడంతో మిగిలిన షాపులన్నీ తిరిగాడు. వాళ్ళు పై భంగిమలతోపాటు వెర్రినవ్వు, పిచ్చి చూపు వంటి చేష్టలు చేశారు. కానీ ప్రిస్క్రిప్షన్‌పై మెడిసిన్ మాత్రం దొరకలేదు.

కాళ్ళీడ్చుకుంటూ నీరసంగా తిరిగి తన కూతుర్ని జాయిన్ చేసిన హాస్పిటల్‌కే తిరిగివచ్చాడు. ఎదురుగా తెరిచి ఉన్న షాపు చూడగానే ఆనందంతో పిచ్చి కేక పెట్టి ఆషాపు వైపు పరుగెత్తాడు. షాపతను ప్రిస్క్రిప్షన్ చూసి పై వాళ్ళు చేసిన చేష్టలన్నీ చేసి కంటనీరు పెట్టుకుంటూ ''నాకేం అర్థంకావడంలేదు పదండి ఇప్పుడే డాక్టర్‌గారు వచ్చారు ఆయన్నే అడుగుదాం'' అన్నాడు. ఇద్దరూ డాక్టర్ దగ్గరకు వెళ్లి తమ బాధలు వెళ్లబోసుకున్నారు కన్నీళ్లతో.

రవిచంద్ర ప్రిస్క్రిప్షన్ చూసి పడీపడీ నవ్వి ఆనక నవ్వలేక పొట్టపట్టుకుని కళ్లనీళ్ళు పెట్టుకోసాగాడు. గోవిందం, షాపతను టీవీలో సీరియల్ ఎప్పుడు ముగుస్తుందో తెలియని ప్రేక్షకుల్లా వెర్రిముఖాలతో చూశారు ఆయన వైపు.

''ఏం లేదయ్యా పైది మీ పాప పేరు. మిగిలినవన్నీ మెడిసిన్స్. నేను చేసిన పొరపాటు ఏంటంటే పాప పేరు ముందు ఒకటి అంకె వేసి వరుసక్రమంలో మిగిలిన మెడిసిన్స్ రాశానంతే'' అన్నాడు రవిచంద్ర.

**-కలపర్తి సత్యం ఏలూరు)**

❑